రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.19, దొండ రూ.50, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.20, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.55, మునగ రూ.45, కందగడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.18, కీర రూ.23, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.31. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజావాణిలో 6 ఫిర్యాదులు

చాదర్‌ఘాట్: ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు వచ్చాయని మలక్‌పేట డిప్యూటీ కమిషనర్ సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. అజంపురా నుంచి 2 ఫిర్యాదులు ప్రాపర్టీ ట్యాక్స్, ఓల్డ్‌మలకోపేట డివిజన్ నుంచి 2 శానిటేషన్‌పై 2 అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభం కాని దరఖాస్తుల పరిశీలన

చాదర్‌ఘాట్: దివ్యాంగుల స్వయం ఉపాధి నిమిత్తం రూ. 50 వేల ఆర్థిక సహాయం కోసం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ఇంకా ప్రారంభం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 3.50 కోట్ల రుణాలు ఇవ్వడానికి సంక్షేమశాఖ కార్యాలయం ప్రకటించింది. ఈ క్రమంలో హైదరాబాద్ జిల్లా నుంచి దాదాపు 3223 దరఖాస్తులు వచ్చాయని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. దివ్యాంగులు దరఖాస్తులు చేసుకొని రెండు నెలలు కావస్తున్నా దరఖాస్తుల పరిశీలన ఇంకా ప్రారంభం కాలేదు. దరఖాస్తుల పరిశీలనలో మండల ఎంఆర్‌ఓ, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సెలక్షన్‌లో సభ్యులు ఉన్నారు. సిబ్బంది కొరత కారణంగానే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానట్లు సమాచారం.

ఆలయ అభివృద్ధికి కృషి



నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మన్సూరాబాద్: శ్రీరామ్‌నగర్‌కాలనీలోని షిరిడీ సాయిబాబా దేవాలయ సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు సోమవారం ఆలయంలో సమావేశమై కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని చైర్మన్‌గా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్‌ను సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, సాయినాథ్, ఉపేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, సత్తయ్య, రామారావు, ప్రదీప్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా కాలనీ ఫేజ్–2లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాయంలో గత మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, కుంభప్రోక్షణ అలంకరణ, హోమం, కుంకుమ పూజ, ఆశీర్వచనం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పూజల్లో కాలనీ అధ్యక్షుడు గాండ్ల ఆనంద్ రాజ్, ఆలయ అధ్యక్షుడు ఎస్.రాములు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ధ్వజస్తంభ దాతలు భవానీ రాజశేఖర్, విజయ, భవానీ ప్రమోద్‌కుమార్, అనిత, కాలనీ నాయకులు సతీష్‌కుమార్, నాగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని కాలనీలను అబివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.27లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బండ్లగూడ చెరువు.. సుందరీకరణ కరువు

• కంపచెట్లతో నిండిన చెరువు కట్ట • అర్ధంతరంగా అభివృద్ధి పనులు • పూర్తి చేయాలంటున్న ప్రజలు • పట్టించుకోని అధికారులు





బండ్లగూడ చెరువు కట్ట వాకింగ్ ట్రాక్‌పై పెరిగిపోయిన చెట్లు

నాగోలు: చెరువులను అభివృద్ధి చేస్తామంటున్న అధికారుల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోలు బండ్లగూడ చెరువు సుందరీకరణకు నోచుకోకుండా అభివృద్ధికి దూరంగా ఉంది. గతంలో అధికారులు కొంత పనులు చేపట్టి మధ్యలోనే వదిలేయడంతో పరిసర ప్రాంత కాలనీ వాసులు వాకింగ్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. బండ్లగూడ చెరువు అభివృద్ధి కోసం గతంలో ప్రభుత్వం నిధులు కేటాయించి కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి బెంచీలు ఏర్పాటు చేశారు. చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించిన అధికారులు చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అధికారులు వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం చెరువు కట్టపై కొంత దూరం పట్టిపోసి వదిలేశారు. అధికారులు పనులు పునఃప్రారంభించక పోవడంతో చెరువు కట్టపై పెద్ద ఎత్తున్న కంప చెట్లు పెరిగిపోయాయి.

వాకింగ్ చేయలేకపోతున్నాం..

బండ్లగూడ చెరువు పరిసర ప్రాంత కాలనీ వాసులు చెరువు కట్టపై సరైన దారి లేక వాకింగ్ చేయలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు సుందీరకరణ పనులు పూర్తిగా నిలిచిపోవడంతో పరిసర కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాకింగ్ చేసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెరువు సమీపంలో రాఘవేంద్ర కాలనీ, సాయినగర్ కాలనీ, గణేష్‌నగర్, గీతనగర్, లలీతనగర్, మల్లికార్జుననగర్,లేక్ హోమ్స్ ఇతర సమీప కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బండ్లగూడ చెరువును అభివృద్ధిచేసి వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేయాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

బండ్లగూడ చెరువు కట్టపై రాత్రి సమయంలో ఇతర ప్రాంతాలను నుంచి యువకులు పెద్ద సంఖ్యలో వచ్చి కట్టమద్యం, గంజాయి తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయంలో సరైన నిఘా లేకపోవడంతో పెద్ద సంఖ్యలో యువకులు వస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్‌ను నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే చెరువు సందరీకరణ పనులు పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

కాటమయ్య రక్షణ కిట్లను అందజేయాలి



చికిత్స పొందుతున్న గీత కార్మికుడిని పరామర్శిస్తున్న కేజీకేఎస్ నాయకులు

నాగోలు: గీత కార్మికుల రక్షణకు తొమ్మిది నెలలు క్రితం ప్రకటించిన కాటమయ్య రక్షణ కిట్లు నేటికీ అందక ఎంతో మంది గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. తాటిచెట్లపై నుంచి పడి ప్రమాదానికి గురై నాగోలులోని సుప్రజా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జనగామ జిల్లా, చిటకొండూరు గ్రామానికి చెందిన బాల్ని శ్రీనివాస్, పెద్ద మడ్డూరుకు చెందిన గోడిశాల శ్రీనివాస్‌గౌడ్, గొల్లపల్లికి చెందిన తీగల పరుషరాములు ముగ్గురికి కేజీకేఎస్ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..రాష్ట్రంలో 2.50 లక్షల గీత కార్మికులు ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం వారందరికీ వెంటనే కాటమయ్య రక్షణ కవచాలను అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనతో ఇప్పటికే సుమారు 360 మంది గీత కార్మికులు ప్రమాదాలకు గురి కాగా అందులో 42 మంది మృతి చెందారన్నారు. ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులు అలేఖ్య, ఉదయ్, అపూర్వ, జీఎం సతీష్, మేనేజర్ అజయ్‌కుమార్, ప్రభాకర్, విక్రమ్, సత్యగౌడ్, మహమూద్ సిబ్బంది పాల్గొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గీత కార్మికుల్లో ఎవరు ప్రమాదాలకు గురైన తమ హాస్పిటల్‌లో ఉచితంగా చికిత్స అందిస్తున్నామని సుప్రజా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శిగ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇప్పటి వరకు ప్రమాదాలకు గురైన 66 మంది గీత కార్మికులకు ఉచితంగా శస్త్ర చికిత్స అందించామన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలోని శివసూర్య రామాలయం నిర్మాణానికి సోమవారం వేద పండితులు భూమిపూజ చేశారు. పండితులు బ్రహ్మశ్రీ సన్నిధానం శ్రీధరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రామ్మూర్తి, వక్కలంక శ్రీనివాసరావు, రామాచార్యులు, వన్నాడి శ్రీనివాస్, శివరాం, వుటుకూరి దయాకర్, దండెం జనార్దన్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంద న్నారు. ఈ సందర్భంగా ఎక్కడలేని సూర్య దేవాలయం.. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్నందున భక్తులు ఆరోగ్య రీత్యా పూజలు చేసుకునే భాగ్యాన్ని ప్రసాదిస్తున్న డాక్టర్స్ కాలనీలోని శ్రీసూర్య రామాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులను వారు అభినందించారు. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి అంజన్, రాధాధీరజ్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న వేదపండితులు

నాసిరకంగా డ్రైనేజీ పనులు



పగుళ్లు వచ్చిన డ్రైనేజీని పరిశీలిస్తున్న మల్లారెడ్డి, కాలనీవాసులు

బడంగ్‌పేట్: నాణ్యతా ప్రమాణాలు లేకుండా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి ప్రజాధనం వృథా చేస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 26వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అధికారులను కోరారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి, అల్మాస్‌గూడలోని 26వ డివిజన్ హనుమాన్ నగర్ కాలనీలోని రోడ్ నంబర్–1లో డ్రైనేజీ పనులను కాలనీవాసులతో కలిసి నవారు మల్లారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేశారని, సదరు గుత్తేదారు నాసిరకం పనులు చేపట్టడంతో పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఈ దృష్టికి తీసుకొచ్చి, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేస్తున్న గుత్తేదారుల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీలు, సీసీరోడ్లు, బీటీరోడ్ల ఇతర అభివృద్ధి పనుల విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని, నాణ్యత ఉంటేనే బిల్స్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, వెంకటేశ్‌గౌడ్, తిరుపతిరావు, కరణాకర్‌రెడ్డి, మహ్మద్ వలీ, శశిధర్, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

చోరీకి గురైన బైక్ స్వాధీనం

చైతన్యపురి: చోరీకి గురైన బైక్‌కు స్వాధీనం చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జనవరి 12న వీఎం హోమ్ వద్ద పార్కు చేసిన బైక్ చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు వద్ద అనుమానాస్పదంగా బైక్‌పై తిరుగుతున్న ప్రగతినగర్ కాలనీకి చెందిన ధరావత్ లచ్చిరాం అలియాస్ రామ్ (35), సింగరేణి కాలనీకి చెందిన రమావత్ దేవ్య (45)ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ను దొంగిలించినట్లు అంగీకరించారు.

కల్తీనూనె స్థావరంపై పోలీసుల దాడి



మార్కెట్‌లో సోదాలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట మార్కెట్‌లో వంట నూనెలను కల్తీ చేస్తున్న దుకాణంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మార్కెట్‌లోని షాప్ నం– 261లో శ్రీగణేష్ బాలాజీ లక్తాదర్ పేరిట నిర్వహిస్తున్న ఆయిల్ దుకాణంలో కల్తీ నూనెను బ్రాండెడ్ నూనె కంపెనీల ఖాళీ ప్యాకెట్లలో నింపి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సదరు దుకాణంపై దాడులు నిర్వహించి నూనె సామగ్రి, ప్రముఖ కంపెనీల స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు.

చైన్ స్నాచింగ్

నాగోలు: ఓ వృద్ధురాలు మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ పరిధి మర్రిపల్లికి చెందిన వాడేగోని స్వరూప(70) సోమవారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు తెంచ్చుకుని పారిపోయాడు. స్వరూప కేకలు వేస్తుండగా దుండగుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

చైతన్యపురి: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. కోదండరాంనగర్ కాలనీలో ఓ నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా సరూర్‌నగర్ బాపునగర్‌లో నివసించే శ్రీకాకుళం జిల్లా కగువా గ్రామానికి చెందిన బొద్దు కృష్ణగా గుర్తించారు. కూలి పనిచేసే కృష్ణ మద్యం మత్తులో బిల్డింగ్‌పైకి వెళ్లి కిందపడి చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బ్రహ్మోత్సవాలకు సిద్ధం.. హరిహరక్షేత్రం





పువ్వుల ముస్తాబైన పదునెట్టాంబడి, విద్యుత్ దీపాలతో అయ్యప్పదేవాలయం



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 13 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు దేవాలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. నాలుగు వేల సంవత్సరాల క్రితం బైరామల్‌గూడలోని కర్మన్‌ఘాట్‌లో నెలకొన్న అక్కన్న, మాదన్న దేవాలయాల ప్రాంగణంలో నూతనంగా దాదాపు రూ.13 కోట్ల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాల విస్తీర్ణంలో శబరిమల అయ్యప్ప స్వామి ఆలయాన్ని తలపించేలా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ హరిహర క్షేత్రంలో 140 టన్నుల ఏకశిలతో నిర్మించిన పదునెట్టాంబడి ప్రత్యేకత సంతరించుకుంది. ఈ దేవాలయంలో జంటనగరాలలోని అయ్యప్ప భక్తులు, మహిళా భక్తులు శబరికి వెళ్లలేని వారు హరిహరక్షేత్రంలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని ముడుపులు, ఇరుముడులను సమర్పిస్తారు. భాగ్యనగరంలోనే అతి పెద్ద అయ్యప్పదేవాలయమైన కర్మన్‌ఘాట్ హరిహరక్షేత్రం 14వ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవు



డీఈ చందన, సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ శ్రీకృష్ణానగర్‌కాలనీల్లోని రోడ్లు, రహదారులపై ఇష్టానుసారంగా పారబోస్తున్న భవన నిర్మాణ వ్యర్థాలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యలపై సోమవారం 'హెచ్చరికలకే పరిమితం...కానరాని పరిష్కారం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శానిటేషన్ డీఈ చందన స్పందించి సిబ్బందితో కలిసి పలు కాలనీలలో పర్యటించారు. చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులపై చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్య, ఎస్‌ఎఫ్‌ఏ శ్రీనివాసరెడ్డి, యాకయ్య, రాంకి భరత్, జ్యోత్స్న పాల్గొన్నారు.

నల్లా బిల్లులను మాఫీ చేయాలని వినతి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: కార్పొరేషన్‌లో అధిక ఇంటి పన్నులను తగ్గించడంతో పాటు వీకర్ సెక్షన్‌లలో నీటి బిల్లులను మాఫీ చేయాలని బీజేపీ మీర్‌పేట నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి, మీర్‌పేట కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మీర్‌పేట1,2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పక్కనే ఉన్న బడంగ్‌పేట, జీహెచ్‌ఎంసీలో కంటే పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలోనే ఎక్కువగా ఇంటి పన్నులు వసూలు చేయడం సరైందికాదన్నారు. వీకర్‌సెక్షన్ కాలనీలను గుర్తించి నీటిబిల్లులను మాఫీ చేయాలని, గతంలో కౌన్సిల్ సమావేశంలో అధికారులను ఆదేశించామని, బిల్లుల మాఫీకి సత్వరమే చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. నీటి బిల్లుల మాఫీ, పన్నులు తగ్గించేంత వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సోమేశ్వర్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కాసోజు అర్పిత, లతాశ్రీ, కీసర హరినాథ్‌రెడ్డి, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, గౌరీశంకర్ కిషోర్, సూల ప్రభాకర్, గడ్డం జగన్ తదితరులు ఉన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి




సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మన్సూరాబాద్: దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, విద్యాజ్యోతి, సంఘ సంస్కర్త సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా మన్సూరాబాద్ సహారా సెకండ్ గేట్ సమీపంలోని చిత్రసీమకాలనీలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, కొప్పుల విఠల్‌రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి అణగారిన వర్గాల్లో విద్యావ్యాప్తికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాచబోయిన జగదీష్‌యాదవ్, రుద్రయాదగిరి, టంగుటూరి నాగరాజు, విజయభాస్కర్‌రెడ్డి, సతీష్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూనాగోలు కాలనీలో..

నాగోలు: భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సమాజంలోని అణగారిన, అట్టడుగు వర్గాల స్త్రీలకు విద్యను అందించడానికి అనేక త్యాగాలను చేసిన మహిళా మూర్తి సావిత్రిబాయి పూలే అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా న్యూనాగోలు కాలనీ ఎస్‌కే డాంగే భవన్‌లో నిర్వహించిన సావిత్రిబాయి పూలే వర్ధంతిలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉడతల మల్లేష్, జగన్ యాదవ్, సంగు సైదారావు, చెరుకు ఈశ్వర్ గౌడ్, కరుణాకర్‌చ, పి శివకుమార్, జైనుల్లావుద్దీన్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న చిరంజీవులు, ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు